**International Journal of Academic Research**
P-ISSN: 2348-7666: Impact Factor: 6.023
Homepage: https://www.ijar.org.in/
Volume-11, Issue-2,April-June-2024
This work is licensed under a Creative Commons Attribution 4.0 International License [CC BY 4.0]

**Research Article**

# పురుషోత్తమ చౌదరి క్రైస్తవ గేయాల్లో భక్తి

**డా. పొట్లూరి శ్రీనివాసరావు**

**ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చింతలపూడి, ఏలూరుజిల్లా - 534460**

**Corresponding Author: పొట్లూరి శ్రీనివాసరావు**

## 1. ఉపోద్ఘాతం:

17వ శతాబ్ది తొలిరోజుల్లో ఆంధ్రదేశంలో క్రైస్తవమత ప్రచారం మొదలైనట్లుగా మనకు ఆధారాలున్నాయి. పాత నిబంధన 14వ అధ్యాయంలోని టోబియో చరిత్రను 'తోభ్యచరిత్ర'గా రచించిన పింగళి ఎల్లనార్యుడు తొలి క్రైస్తవ కావ్యాన్ని రచించిన ఘనత పొందాడు. మంగళగిరి అనంతయకవి రచించిన 'వేదాంత రసాయనము' అనే కావ్యం కూడా 18వ శతాబ్దిలో ఎంతో ప్రాచుర్యాన్ని పొందింది. ఈ రెండు కావ్యాలు 19వ శతాబ్దికి పూర్వం వెలువడిన క్రైస్తవ కావ్యా లుగా చెప్పబడుతున్నాయి. 19వ శతాబ్దిలో త్యాగరాజు కీర్తనలతో గేయకవిత శిఖరాయమానంగా నిలిచిన రోజుల్లో హిందూ కీర్తనలు, రచనలు ఉచ్ఛస్థితిలో ఉన్నాయి. అందుకు భిన్నంగా అన్యమతానికి చెందిన దేవుని కీర్తించేందుకు కీర్తనలు రచించిన కవిగా పురుషోత్తమ చౌదరి ప్రసిద్ధిచెందారు.

తెలుగులో క్రైస్తవ సాహిత్యానికి పునాదులు వేసి క్రీస్తుచరిత్రను కావ్యాలుగా, పద్యకృతులుగా, కీర్తనలుగా లోకానికి చాటిన వాగ్గేయకారుడు పురుషోత్తమ చౌదరి. 1803 సెప్టెంబర్ 5వ తేదీన సుభద్రాదేవి, కూర్మనాథ చౌదరి దంపతులకు శ్రీకాకుళం జిల్లా తెంబూరు శివారులోని మదనాపురంలో జన్మించారు. వీరిది బెంగాలీ బ్రాహ్మణ కుటుంబం. 1829లో విశాఖపట్నంలో క్రైస్తవసాహిత్యాన్ని అధ్యయనం చేశారు. 1833లో కులాచార పరీక్ష అనే పత్రిక ద్వారా కులవ్యవస్థను తీవ్రంగా ఖండించారు. 1833 అక్టోబరులో కటక్'లో బాప్టిజం తీసుకుని క్రైస్తవ మతప్రచారం ప్రారంభించారు. కాలినడకన పాటలు పాడుకుంటూ ప్రచారం చేసుకుంటూ మద్రాసు వెళ్లారు. అందుకే దాదాపు ఈయన కీర్తనలు ఈనాటికీ అనేక క్రైస్తవ మందిరాల్లో వినిపిస్తున్నాయి. బాప్టిజం స్వీకరించిన దగ్గర్నుంచీ మనసా, వాచా,

https://doi.org/10.5281/zenodo.13123584

కర్మణా క్రైస్తవ మాట ప్రచారానికి తన రచనల ద్వారా మార్గం వేసినకవిగా నిలిచిపోయారు పురుషోత్తమ చౌదరి. చౌదరి సి.పి.బ్రౌన్, త్యాగరాజుల సమకాలికుడు. తాను రాసిన క్రైస్తవ కీర్తనలను స్వయంగా గానం చేస్తూ ప్రజాబాహుళ్యానికి అందించారు. అందుకే ఈయన రచించిన అనేక క్రైస్తవ కీర్తనలు, రచనల వల్ల "ఆంధ్రక్రైస్తవ కవిసార్వభౌముడి'గా కీర్తించబడుతున్నారు.

## 2. పురుషోత్తమ చౌదరి రచనలు:

త్యాగరాజు రచించిన ప్రహ్లాద భక్తివిజయము పద్ధతిలో రక్షణచరిత్ర, నిస్తార రత్నాకరము అనే సంగీత రూపకాలను 1846లో రచించాడు. ఇవి తొలి క్రైస్తవ సంగీత రూపకాలుగా పేరుపొందాయి. సత్యభజన అనే పేరుతో ఒక భజనగీతాల సంకలనాన్ని కూడా 1874లో రచించారు. తెలుగు వర్ణమాలలోని 'అ' నుండి 'క్ష' వరకు గల అక్షరాలను ఉపయోగిస్తూ ఒక్కొక్క కందపద్యం, దానికింద ఒక కీర్తన రచించి దానికి 'అక్షరమాలికా కందాలంకార భజన గీతాల సంకలనం' అనే పేరు పెట్టాడు. ఈ సంకలనం క్రైస్తవగేయసాహిత్యానికి ఒక విశిష్టమైన అలంకారంగా నిలించింది. అంతేగాక పురుషోత్తమ చౌదరి పద్యకృతులను కూడా రచించినట్లు తెలుస్తోంది. వాటిలో 'యేసునాయక శతకము', 'యేసుక్రీస్తు ప్రభు శతకము' అనేవి రెండు శతకాలు. పంచ చామర ఛందస్సులో మకుట సహితంగా 'పంచ చామర పన్నములు' అనే రచన, ఐదు సీసపద్యాలతో 'పంచ రత్నములు' అనే సంకలనం, క్రైస్తవ నీతి ప్రకాశము, సత్యవేద సార సంగ్రహము అనే పద్యకావ్యాలను కూడా రచించారు. పైన చెప్పిన వాటిలో 1845లో వెలువడిన 'యేసు నాయక శతకము' తెలుగు శతక వాఙ్మయంలో మొట్టమొదటి క్రైస్తవ శతకంగా కీర్తించబడుతోంది.

## 3. పురుషోత్తమచౌదరి క్రైస్తవ కీర్తనలు:

పురుషోత్తమ చౌదరి రచించిన అనేక క్రైస్తవ కీర్తనలు నేటికీ ఎంతో ఆదరణ పొందుతున్నాయి. బాప్టిజం స్వీకరించిన నాటినుండి యేసుక్రీస్తు బోధనలను ప్రచారం చేస్తూ వాటిని పాటలరూపంలో పాడుతూ జనసామాన్యానికి చేరవేసిన ఘనత పురుషోత్తమ చౌదరిదే అని చెప్పడం అతిశయోక్తి కాదు. ఈయన రచించిన కీర్తనలు క్రైస్తవ్యంలోని అన్ని విభాగాలకు చెందుతుంది. క్రీస్తు పుట్టినప్పటినుండి చనిపోయి మరియు తిరిగిలేచే వరకు ఉన్న జీవితకాలాన్ని వ్యక్తీకరిస్తూ రాసిన కీర్తనలు నేటికీ అనేక క్రైస్తవ మందిరాల్లో వినిపిస్తూనే ఉన్నాయి. పురుషోత్తమ చౌదరి క్రైస్తవ కీర్తనలను ఈ క్రింది విధంగా మనం విభజించుకోవచ్చు.

https://doi.org/10.5281/zenodo.13123584

### 3.1. క్రీస్తు పుట్టుక మంగళహారతి కీర్తనలు:

క్రైస్తవులకు అత్యంత పుణ్యదినం, పర్వదినం క్రిస్మస్ పండుగ. పరిశుద్ధుడైన క్రీస్తు జనులను వారి పాపాల నుండి విడిపించడానికి రక్షకుడిగా యేసుక్రీస్తు కుమారుని రూపంలో ఈ భూమిమీద జన్మించాడని క్రైస్తవుల విశ్వాసం. కనుకనే ఆ పర్వదినాన క్రైస్తవులందరూ అనేక కీర్తనలతో ప్రభువును మహిమపరుస్తారు. క్రీస్తు లోకంలో ఉదయించడానికి ప్రాధాన్యత కాదుగానీ తమ మనసుల్లో క్రీస్తు ఉదయించినపుడే నిజమైన క్రిస్మస్ పండుగగా క్రైస్తవులు భావిస్తారు. ఈ కోణంలో చూసినపుడు పురుషోత్తమ చౌదరి రచించిన క్రీస్తుపుట్టుక కీర్తనలు కూడా ఎంతో ప్రాచుర్యం పొందాయి.

**1. ఉదయించినాడు – క్రీస్తుడు నేడు – ఉదయించినాడు/ విదితయౌ మరియ నందనుదై యిమ్మానుయేల్**

**2. మంగళము పాడరే క్రీస్తుకు జయమంగళము పాడరే / యో ప్రియులారా మంగళము పాడరే**

**3. మంగళమే యేసునకు మనుజావతారునకు శృంగార ప్రభువునకు క్షేమాధిపతికి**

**4. వందనమే యేసునకు వరుసుగుణోదారుణకు సౌందర్య ప్రభువునకు సర్వేశ్వర నీకు వందనమే**

క్రీస్తు ఎందుకు ఈ భూమిమీద జన్మించాడో పై కీర్తనలో వ్యక్తపరుస్తారు పురుషోత్తమ చౌదరి. జగాన్నంతా సృష్టించిన క్రీస్తు మనుష్యావతారము దాల్చి జనుల పాపాన్ని పోగొట్టడానికి ఉదయించాడనే అభిప్రాయాన్ని తెల్పు తున్నాడు. అంతేగాక మరియ గర్భాన జన్మించి పాపాలతో చెడియున్న ఈ భూమిమీద జనులకు మోక్షం ప్రసాదిం చడానికి జన్మించాడు క్రీస్తు. సాతానుకు మదమణిగేలా, తనను ప్రార్థించేవారికి ఆనందం రెట్టింపయ్యేలా క్రీస్తు ఈ భూమి మీద జన్మించాడనే భావాన్ని వ్యక్తపరుస్తున్నాడు.

### 3.2. సువార్త ప్రకటనను తెలియజేసే కీర్తనలు:

క్రైస్తవజీవితం సవాలుతో కూడుకొన్నది. క్రైస్తవుడిగా జనించిన తర్వాత క్రీస్తును గురించి, క్రీస్తు పరిచర్య గురించి, క్రీస్తు చేసిన అద్భుతాల గురించి నలుదిక్కులకు వెళ్ళి సువార్త ప్రకటించాలని పరిశుద్ధ గ్రంథమైన బైబిల్ చెప్తుంది. క్రీస్తు ప్రేమ గురించి వ్యక్తిగతంగా తాననుభవించడమే కాకుండా ఆ ప్రేమను ఇతరులకు కూడా ప్రకటించడం అనేది క్రైస్తవుల ప్రధాన కర్తవ్యం. అందుకే కొంతమంది క్రీస్తు సువార్తను వాక్యాన్ని చెప్పడం ద్వారా, పాటలు పాడడం ద్వారా చాటడం జరిగింది. పురుషోత్తమ చౌదరి కూడా సువార్త ప్రకటనను గూర్చిన కీర్తనలు రాశారు.

**1. ఇక నేమి గతియున్నది మానవులారా యిక నేమి గతియున్నది పాపుల కోస మిక నేమి గతియున్నది**

**2. నిజముగా పరిశుద్ధు డొకడీ నేలపై లేడు వృజినములచే చెడిన మదిని పవిత్ర మూలం బెటుల**

**3. రారో జనులారా వేగము గూడి రారో ప్రియులారా శాశ్వతమైన ఘన రక్షణ జేర**

యేసు అంటే రక్షకుడనీ, క్రీస్తు అంటే అభిషిక్తుడనీ, అపవిత్రమైన లోకాన్ని మనుషులనూ రక్షించడానికి పవిత్రుడిగా ఈ లోకంలో అవతరించాడని బైబిల్ చెప్తుంది. అందుకే సువార్తను చెప్పడానికి మనుషులంతా సిద్ధపడాలని, అంతరించిపోయే లోకానికి క్రీస్తు బోధనలు అందించాలనే ఉద్బోధ పై కీర్తనలలో కనిపిస్తుంది. యేసుక్రీస్తు తప్ప ఈ భూమి మీద పరిశుద్ధుదొకడైనా లేడనీ, అటువంటి పవిత్రుడిని గూర్చిన వార్తను లోకమంతా చాటాలనే ప్రయత్నాన్ని క్రైస్తవులంతా స్వీకరించాలనీ చెప్తున్నాడు రచయిత.

**3.3. పశ్చాత్తాపాన్ని తెలియజేసే కీర్తనలు:**

క్రైస్తవజీవితంలో అత్యంత కీలకమైనది పశ్చాత్తాపం. తాను పాపినని తెలుసుకుని ఎవరైతే క్రీస్తువైపు తిరిగి శరణు కోరతారో వారిని క్రీస్తు చేరదీస్తాడని బైబిల్ చెప్తుంది. అందుకే బైబిల్లోని మహాభక్తులు కూడా పాపంద్వారానే తాము తల్లి గర్భంలో రూపింపబడ్డామనే ఆలోచనతో పశ్చాత్తాపం పొందుతారు. యేసే నిజమైన రక్షకుడనీ, యేసు తప్ప భూమిమీద ఇంకో దేవుడు లేడనీ, భూమిమీద పాపులకు మారుగా తాను సిలువమరణం పొందాడనీ క్రైస్తవుల విశ్వాసం. ఆ కోణంలో పురుషోత్తమ చౌదరి రాసిన పశ్చాత్తాపాన్ని వ్యక్తపరిచే కీర్తనలు ఈ క్రిందివి.

**1. ఉన్నపాటున వచ్చుచున్నాను నీ పాద సన్నిధికో రక్షకా యెన్న శక్యముగాని పాపము లన్ని మోపుగ**

**2. ఎరిగి ఎరిగి చెడిపోతివి మనసా యిక నీ దిక్కెవ్వరు చెపుమా**

**3. త్రాహిమాం క్రీస్తునాథ దయాజూడ రావే నేను దేహీయనుచు నీ పాదములే దిక్కుగా జేరితి నిపుడు**

**4. పోయెగ పోయెగ కాలము వెళ్ళి పోయెగ పోయెగ మాయ సంసార సంపద గూర్పమరిగి యాయువంతయు**

పై కీర్తనలలో వ్యక్తి జీవితంలోని పశ్చాత్తాపాన్ని వివరిస్తున్నాడు కవి. పుట్టుకలు, భోగాలు, సంపదలు, సంబంధాలు ఏమీ శాశ్వతం కాదనీ, దేహీయని నీ పాదాలనే దిక్కుగా ఇప్పడు నేను చేరుకున్నాననే విషయాన్ని చెప్తున్నాడు. మాయా సంసారంలో పడి కాలమంతా వృథా

https://doi.org/10.5281/zenodo.13123584

అయిపోయిందనీ, జీవితం మీది వ్యామోహంతో ఆయువంతా తరిగిపోయిందనీ, ఇకనైనా తెలుసుకుని నీ వైపు తిరిగాను నన్ను కరుణించు అనే పశ్చాత్తాపాన్ని చెప్తున్నాడు కవి. జీవితం ఎంతో అందమైనదనీ, దాని మాయలో పడి తెలిసి తెలిసి చెడిపోయాననీ ఇక ఆ యేసుక్రీస్తు తప్ప తననెవరు రక్షించ గలరని కనుకనే నీ సన్నిధిక ఉన్నపాటుగా వస్తున్నానని పశ్చాత్తాపాన్ని ప్రకటిస్తున్నాడు.

**3.4. సిలువ ధ్యాన కీర్తనలు:**

క్రైస్తవజీవితంలో మరొక ముఖ్యాంశం సిలువను ధ్యానించడం. క్రీస్తు చనిపోయిన రోజును గుడ్ ఫ్రైడేగా పిలిస్తే, తిరిగిలేచిన మూడవదినాన్ని ఈస్టర్'గా జరుపుకుంటారు క్రైస్తవులు. మనుషులు తాము చేసిన పాపాలకు ప్రతిగా క్రీస్తు తన ప్రాణాన్ని సిలువలో అర్పించుకున్నాడని బైబిల్ చెప్తుంది. అందుకే క్రీస్తు లోకంలో ఉన్నంతకాలం అనేక సూచక క్రియలను చేశాడు. అనేకమందిని తమ పాపాల నుండి విడిపించాడు. అనేకమంది అవయవలోపం ఉన్నవాళ్లకి కళ్ళూ, కాళ్ళూ, చేతులు ఇచ్చాడు. ప్రతీ క్రైస్తవుని జీవితంలో సిలువను ధ్యానించడం క్రీస్తు పట్ల తమకున్న విశ్వాసాన్ని భక్తినీ చాటడానికి మెట్టుగా భావిస్తాడు. పాపులు తాము ఆలోచనలతో చేసిన పాపాలకు క్రీస్తు తన తలమీద ముళ్ళకిరీటం పెట్టబడిందని, తాము చేతులతోనూ కాళ్లతోనూ చేసిన పాపాలకు ప్రతిఫలంగా సిలువలో క్రీస్తు కాళ్ళకు చేతులకు మేకులు కొట్టబడ్డాయని క్రైస్తవ విశ్వాసులు నమ్ముతారు. అందుకే పురుషోత్తమ చౌదరి రాసిన కీర్తనలలో కూడా మనకు అనేక సిలువధ్యాన కీర్తనలు కనిపిస్తాయి.

**1. సిలువను మోసితివా నా కొరకై కలువరి మెట్టుపైకి సిలువ నా యాత్మలో పలుమారు దలపగా**

**2. ఏ మాశ్చర్యము ప్రియులారా క్రీస్తు మరణము ప్రేమ జూడరె మనసార**

**3. పాపుల యెడ క్రీస్తుని ప్రియమెట్టిదో పరికింపరె కల్వరిగిరిపై**

**4. అపుడర్చకాదు లుపొ్పంగిరి ప్రభుని విపరీతముగ చంపసాగిరి**

సాధారణంగా మనుషులకు చిన్న దెబ్బ తగిలితేనే ఎంతో బాధపడతారు, మరెంతో విలవిల్లాడతారు. కానీ ఏ తప్పూ చేయకపోయినా కొరదాలతో కొట్టి రాళ్ళు ముళ్ళు ఉన్న నేలపై నడిపించి ముఖాన ఉమ్మి వేసి మరెన్నో చిత్ర హింసలు పెట్టి ఘోరంగా సిలువ మరణం పొందిన క్రీస్తు ఎంతగా వేదనపడి ఉంటాడో పై కీర్తనలలో మనం గమనించ వచ్చు. సిలువ మరణానికి తనను తాను అప్పగించుకున్నాడంటే క్రీస్తు మనుషులను ఎంతగా ప్రేమించాడో మనం అర్థం చేసుకోవాలి. ఏ వ్యక్తీ ఎదుటి వానికొరకు తన ప్రాణం పెట్టడు. కానీ క్రీస్తు మాత్రం తన ప్రజలను వారి పాపాల నుండి

https://doi.org/10.5281/zenodo.13123584

విడిపించడానికే తన ప్రాణాన్ని సిలువలో అర్పించాడు. కనుకనే సిలువను ధ్యానించడం అనేది క్రైస్తవులు చాలా పవిత్రతగా భావిస్తారు, ఆరాధిస్తారు.

**3.5. క్రీస్తుని చాటించే ఇతర కీర్తనలు:**

పురుషోత్తమ చౌదరి బైబిల్‌కి సంబంధించి ఎన్నో కీర్తనలు రచించారు. పై వివరించిన కీర్తనలే కాకుండా క్రీస్తు జీవితంలోని అనేక సంఘటనలను, వ్యక్తి జీవితానికి బైబిల్ అన్వయంగా ఇంకా అనేక కీర్తనలు రాశారు. లోకంపై ఆశ, భోగాలపై ధ్యాస లేకుండా బైబిల్ మీద ఆధారపడడం అనే విషయం బైబిల్ చెప్తుంది. నీ చుట్టూ ఉన్న లోకానికి నువ్వు బానిస కాకుండా లోకంలో ఒకడిలా కాకుండా క్రైస్తవుడు తన భక్తిని కాపాడుకోవాలనే సందేశాన్ని కూడా ఇస్తుంది బైబిల్. అందుకే లోకంలో ఉండే భోగాలు క్రైస్తవులకు తృణప్రాయంగా కనిపిస్తాయి.  ఆ విషయాన్ని ఈ క్రింది కీర్తనలో లోకాన్ని విసర్జించాలనే సందేశమిస్తూ రాస్తారు.

**పోపోవే యో లోకమా చాలిక జాలు నీ పొందు**

**మే మొల్లము పాపేచ్ఛలున్నంత సేపు నోపగరాని వేపాట్లు బెట్టితి వీ పట్ల నను వీడి   (పోపోవే)**

తనను పట్టి పీడించి అవమానాల పాలు చేసిన పాపాన్ని, లోకాన్ని వదలాలనుకుంటున్నాడు. లోకంతో సహవాసం చేయడం దేవునికి విరోధమవుతుందని నమ్ముతారు క్రైస్తవులు. అందుకే లోకంలోని అన్నిటినీ త్యజించి క్రీస్తుని శరణు వేడితే తల్లిలా, తండ్రిలా, స్నేహితుడిలా, బంధువులా క్రీస్తే ఆదరిస్తాడనే నమ్మకం ప్రతీ క్రైస్తవునికీ ఉంటుంది. అదే విషయాన్ని ఈ క్రింది కీర్తనలో చెప్తున్నాడు.

**"నీ చరణములే నమ్మితి నమ్మితి నీ పాదములే పట్టితి పట్టితి పట్టితి"**

ఐహిక సుఖాలన్నిటినీ విడిచి నిన్నే వెంబడిస్తాను, నా క్రియలను అసహ్యించుకుని నన్ను దూరంగా త్రోసివేయకు అని క్రీస్తుకు నివేదిస్తున్నాడు కవి. అంతేకాదు తనది చంచలబుద్ధి, వంచన చేసే మనస్తత్వమనీ నన్ను వేరే ఏ మానవుడూ రక్షించలేడనీ, రక్షించడానికి సమర్థుడవైన దేవుడవనీ నీ పాదాలను నేను ఆశ్రయించాను అని చెప్తున్నాడు కవి. కనుకే మనలోని బలహీనతలను విడిచిపెట్టి క్రీస్తుమీద భారం వేసి క్రీస్తును ఆశ్రయిస్తే ఆయన అన్నీ సందర్భాలలోనూ మనల్ని తన సొంత బిడ్డలాలాగా కాపాడే దేవుడిగా ఉన్నాడనే విషయం పై కీర్తనలో తెలుస్తుంది.

**ముగింపు:**

ఈ విధంగా పరిశీలిస్తే పురుషోత్తమ చౌదరి రాసిన కీర్తనలు మనకు ఆనందాన్ని కలిగిస్తాయి. తనను రక్షించిన దేవుని పట్ల కృతజ్ఞత, తన దేవునికి తానేదో చేయాలనే తపన, తన మాటల ద్వారానో

పాటల ద్వారానో క్రీస్తును లోకానికి చాటాలనే ఆరాటం మనకు ఆయన కీర్తనలలో కనిపిస్తాయి. దేశికవితా ప్రస్థానానికి ఆద్యుడైన త్యాగరాజు సమకాలికు డిగా పురుషోత్తమ చౌదరి క్రైస్తవ గేయాలను వ్యాప్తి చేయడంలో ఎంతో ప్రముఖ పాత్రను పోషిస్తారు. క్రైస్తవజీవితంలో పోరాటం తప్పదని, అయినా సాతాన్ని జయించి క్రీస్తువాక్యాన్ని నలుదిక్కులా వ్యాప్తిచేయాలనే స్ఫూర్తి ఆయన కీర్తనలు కలిగిస్తాయి. మనం సహవాసం చేయాల్సింది ఈ లోకంతో కాదు, మన బంధువు స్నేహితుడు సర్వం క్రీస్తే అని చాటతాడు. క్రీస్తుని భక్తితో నమ్మి ఆయన యందు నిరీక్షణ ఉంచి ఆయన వ్యాప్తికి కష్టపడితే క్రీస్తు తన పరలోకంలో మనకు స్థానమిస్తాడనే నిరీక్షణ ఈ గేయాలలో మనకు కనిపిస్తుంది. ఈ భూమిమీద ఎన్ని భోగాలను అనుభవించినా, ఎన్ని సంపదలు కలిగిఉన్నా క్రీస్తు నీ జీవితంలో లేకపోతే అవన్నీ వ్యర్థమని తన కీర్తనల ద్వారా తెలియజెప్పాడు పురుషోత్తమ చౌదరి. క్రైస్తవులు అలుపెరగని సైనికుల్లాగా క్రీస్తురాకడ కొరకు కష్టపడి పనిచేయాలని ఉద్బోధిస్తాడు. నమ్ముట నీవలనైతే నమ్మువానికి సమస్తమూ సాధ్యమవుతుంది అని చెప్తుంది బైబిల్. దేవుడు ఈ లోకాన్ని ఎంతో ప్రేమించాడు కనుకనే తాను ప్రేమించిన బిడ్డల కోసం మనిషిరూపంలో ఈ భూమ్మీదకు వచ్చాడు. కనుక లోకమంతా ఆయనను నమ్మి ఆయన కోసం పాటుపడాలనే అంతర సత్యాన్ని పురుషోత్తమ చౌదరి కీర్తనలు మనకు తెల్పుతాయి.

***

ఉపయుక్త గ్రంథాలు – వ్యాసాలు:

1. ఆంధ్ర క్రైస్తవ కవి సార్వభౌముడు 'పురుషోత్తమ చౌదరి' గారి జీవిత చరిత్ర, బాబు జాన్ చౌదరి, ఆగస్ట్ 2015, పబ్లిషర్ జేమ్స్ జయశీల్ చౌదరి, చర్చి కాంపౌండ్, జొన్నాడ, విజయనగరం.

2. పురుషోత్తం చౌదరి - తెలుగు క్రైస్తవ సాహిత్యం యొక్క చక్రవర్తి, హానోక్ ఎస్, 14 ఆగస్ట్ 2023, బర్నబాస్ టుడే.